# జున్నుపాలు

ముగ్గుబుట్టలాంటి తల. ముడతలు పడ్డ శరీరం. లోతుకుపోయిన కళ్ళు. తెల్లచీర, వెరసి సూరమ్మ.

వీథి అరుగుమీద కూర్చుని రోడ్డువైపు తదేకంగా చూస్తోంది. ఆమె మిగతా శరీరావయవాల్లో చిన్నపాటి కదలిక కూడా లేదు. కళ్ళల్లో మాత్రమే కాస్తంత కళవుంది. ఆమెలోని జీవపదార్థమంతా కళ్ళల్లోకి చేరినట్టు గాజుకళ్ళల్లో తళుక్కున మెరుస్తోంది చిన్న ఆశ.

ఊపిరి ఉగ్గబెట్టుకుని కళ్ళు చిట్లించి మరీ చూస్తోంది. అరక్షణం అజాగ్రత్తగా వుంటే ఎక్కడతడు తన దృష్టినుంచి తప్పుకుంటాడోనని చూస్తోంది.

ఎట్టకేలకు పోస్టుమేన్ దేవుడు ప్రత్యక్షమయ్యాడు.

ఆమె మొహంలోకి అత్యద్భుత ఉత్కంఠభరితరసం పొంగివచ్చింది.

దేవుడు ఆమె వంక చూడనైనా చూడకుండా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆమె కళ్ళల్లోని ఆశాదీపం గుప్పుమని ఆరిపోయింది.

చిన్నగా సన్నగా నిట్టూర్చింది. మరి శక్తిలేని దానిలా అరుగుమీద ఒరిగి ముడుచుకుని పడుకుంది.

ఆమెకి కొంచెం దూరంగా అదే అరుగుమీద కూర్చునున్నారు రమణయ్య. చుట్ట కాల్చుకుంటూ అంతా గమనిస్తూనే వున్నారు. ఆయన మనస్సు బాధతోమూల్గింది. కోపంతో మండింది.

"సత్తిగాడి దగ్గర్నుంచి ఇయాలా ఏవీ రాలేదన్న మాట"

పిడుగులాంటి మాటలకి గబగబా లేచి సర్దుక్కూర్చుంది. అంతవరకూ ఆయన ఉనికిని గుర్తించలేదామె.

"ఇలా ఎదురుచూత్తానే ఎప్పుడో గుటుక్కుమనేట్టున్నావుగాని అప్పా. పోస్టుమేస్టార్తో చెప్పి సత్తిగాడికి ఘాటుగా ఉత్తరం రాయించేత్తాను"

"రేపో ఎల్లుండో పంపుతాళ్ళేరా. వాడికెన్ని పనులున్నాయో ఏవోఁ!"

"నువ్వలా వెనకేసుకు రాబట్టే ఆడి కళ్ళు నెత్తిమీదకొచ్చాయ్. నువ్వీ పల్లెటూళ్ళో మాడిచస్తావుంటే ఆడక్కడ పట్నంలో జల్సా సేస్తున్నాడు. కన్నతల్లి తింటుందో ఛస్తుందో కనుక్కోని కొడుకూ ఓ కొడుకేనా థూత్...." ఛీత్కారంగా వూశారు.

ఆమె తల్లి మనస్సు విలవిల్లాడింది. మరేమీ బదులు చెప్పలేక మెల్లగా లేచింది సూరమ్మ.

'కొడుకునేవైనా అంటే మాత్రం ఇంతలావు కోసం పొడుచుకొస్తాది. ఆడెంత మాదచ్చోద్ అయినాసరే ఆడంటే ప్రేమే?! ఏం ఆడోళ్ళో ఏవోఁ ఇంద ఈ పదీ వుంచు అప్పా. పోనీ ఓపాలి బెజవాడెల్లి రారాదూ" పదినోటు ఆమె చేతిలో కుక్కి సమాధానం ఆశించకుండా వెళ్ళి పోయారు రమణయ్య.

గప్పెట్లోని నోటు వంక చూసింది.

ఒకప్పుడు పెద్దకాపు భార్యగా గ్రామంలో గౌరవించబడింది. ఇప్పుడు ఊరోళ్ళ దయాదాక్షిణ్యాల మీద.....!

కన్నీళ్ళు జలజలా పొంగివచ్చాయి.

అవి కన్పించకుండా గబగబా లోపలికెళ్ళి కుక్కిమంచమీద పడుకుంది.

తన బతుకులోని వెలుగంతా ఆయనతోనే పోయింది. ప్రయోజకుడయ్యాడని సంతోషించింది. కాని అదీ మూణ్ణాళ్ళ ముచ్చటే అయ్యింది. కొడుకు పెద్ద ఆఫీసరు. కోడలు పెద్దింటి ఆడబడుచు. వారి మధ్య తనో పనికిరాని పాతపెట్టె, విలువలేని దిష్టిబొమ్మ అయిపోయింది. గుదిబండలా మారిపోయింది.

దూరంగా వుంటేనే అభిమానాలూ అనురాగాలూ నిలుస్తాయనుకుని పల్లెకి వచ్చేసింది. ఒంటెద్దు ప్రయాణం. కొడుకు నెలనెలా వందో యాభయ్యో పంపిస్తూంటాడు. దాన్తోనే సరి పెట్టుకుంటూ గుట్టుగా కాలం దొర్లించేస్తోంది.

కానీ గత రెండు నెలల్నుంచీ కొడుకెంచేతో డబ్బు పంపటంలేదు. తన పని ఒడ్డునపడ్డ చేప పరిస్థితియ్యింది. మింగలేని కక్కలేని పరిస్థితి. ఓ పక్క కొడుకు పరువు, మరోపక్క తన భుక్తి రెండూ ముఖ్యమే అనుకుని రెండు కత్తుల్ని ఒక ఒరలో ఇరికించాలని వ్యర్థప్రయత్నం చేస్తూ వస్తోంది. అది గ్రహించి ఇరుగూపొరుగూ సాయం చేస్తున్నారు. సానుభూతి చూపిస్తున్నారు. ఈ పరిస్థితిని భరించటం మరింత కష్టంగా వుంది.

రమణయ్య అన్నట్టు ఓసారి బెజవాడ వెళ్తే?

కొడుకుని చూసి చాన్నాళ్ళయ్యింది. తనలోని పక్షి ఏ క్షణాన్నైనా ఎగిరిపోవచ్చు. ఈలోగా ఒక్కసారి కొడుకుని కళ్ళారా చూసినట్టూ వుంటుంది. తన పరిస్థితి తెలిపినట్టూ వుంటుంది. కొడుకు బాగోగులు చూసినట్టూ.....

ఆమె గుండె కొట్టుకోవడం ఆగిపోయిందొక్క క్షణం.

అవును కొడుకు డబ్బు పంపటంలేదనే ఆలోచిస్తోంది. ఖాళీలేక పంపలేదు కాబోలనుకొంటోంది. ఎప్పుడూ ఠంచనుగా పంపే కొడుకు గత రెండు మూడు నెలల్నుంచీ పంపటం లేదంటే కొడుకెలా వున్నాడో! కోడలూ మనవలూ ఎలా వున్నారో! మాయదారి కాలం. ఏ క్షణంలోనైనా ఏమైనా జరగొచ్చు!

“నా బిడ్డకీ వాడి కుటుంబానికీ ఏమీ కాకుండా చూడు తండ్రీ” మూగగా ప్రార్థించింది భగవంతుణ్ణి.

మరొక్క క్షణం నిలవలేకపోయిందా తల్లి ప్రాణం. కొడుకుని చూడాలన్న ఆరాటం ఆమె అణువణువులోనూ త్రివిక్రమరూపం ధరించింది. తటాలున లేచి కూర్చుంది.

ఒంట్లో శక్తిలేదు. అయితేనేం చేతిలోని పది రూపాయలూ బలాన్ని ప్రోదిచేశాయి. కొడుకుని చూడాలన్న ఆకాంక్ష అంతులేని శక్తినిచ్చింది.

గబగబా రెండు చీరలు సంచీలో కుక్కుకుని తయారయ్యింది సూరమ్మ.

అప్పుడు గుర్తొచ్చింది. కొడుకోసం తీసుకెళ్ళడానికి ఇంట్లో ఏమీలేవని. ఎప్పుడెళ్ళినా కోవాలో, కజ్జికాయలో, పూతరేకులో ఏదొకటి ప్రత్యేకంగా వండించి తీసుకెళ్తుంది. దగ్గరుండి తినిపిస్తుంది.

అదేం చిత్రమోగాని చిన్నప్పట్నుంచీ కూడా సత్యనారాయణ ఆకలెరగడు. ‘అమ్మా అన్నం పెట్టవే’ అని ఎప్పుడూ అడిగి ఎరగడు. తనేమిటో తన చదువేమిటో ఆటలేమిటో అనేట్టుండే వాడు. అడగందే అమ్మ అయినా పెట్టదంటారు. అడక్కుండా పెట్టేదే అమ్మ అనుకుంటుంది సూరమ్మ. అందుకే పిలిచి బతిమాలి మరీ పెట్టేది. అయినా సరిగ్గా తినక ఎప్పుడూ ఏడిపిస్తూండేవాడు.

ఎంత చిత్రం!

అప్పట్లో తను తినక ఆమెని ఏడిపించేవాడు.

ఇప్పుడు తను పెట్టక ఆమెని ఏడిపిస్తున్నాడు.

అప్పుడూ ఇప్పుడూ కన్నతల్లికి కొడుకువల్ల దు:ఖమే!

అయినా ఆమె పుత్రప్రేమలో నూరోవంతు కూడా తగ్గలేదు. తగ్గబోదు. అందుకే ఆమెని దేవుడి ప్రతినిధి అన్నారు.

ఏం చేయాలో పాలుపోలేదు సూరమ్మకి. ఏ పిండి వంట వండించాలన్నా ఇంట్లో సరుకుల్లేవు. చేతిలో ప్రయాణానికి బొటాబొటీగా సరిపడేంత డబ్బు మాత్రమే వుంది.

మరేం చెయ్యటం ?

ఆమె మస్తిష్కంలో ఏదో మెరిసింది. మొహం వెలిగింది.

ఎవరింటనైనా గేదె ఈనిందేమోనని ఊళ్ళోని పదిమందినీ అడిగింది. ఈదుగోళ్ళ రామన్న ఇంట్లోని గేదె ఈనిందని తెలిసింది. పరుగునెళ్ళి బతిమాలి ఇన్ని జున్నుపాలు తెచ్చింది. కొడుక్కి జున్నంటే ఎంతో ఇష్టం మరి.

జున్ను పాలు దొరికేసరికి ఆమె కడుపు ఆనందంతో నిండిపోయింది.

తెల్లారి లేచేక పచ్చిమంచినీళ్లైనా ముట్టలేదన్న సంగతి మరచి ప్రయాణమయ్యింది.

మధ్యాహ్నం రెండు గంటలయ్యింది. ఎండ ఫెళఫెళలాడుతోంది. ఆకలి కరకర మంటోంది. నీరసంతో ఒళ్ళు తూలుతోంది. అయినా లెక్కచెయ్యట్లేదు. జున్నుపాలు పాడవ్వ కుండా కొడుకు ఇంటికెళ్ళాలి. వెంటనే జున్ను వండించాలి. కొడుకు దాన్ని తింటూంటే తృప్తిగా చూడాలి!

తన దగ్గర మిగిలిన డబ్బులికి ఏ రిక్షావాడూ రాలేదు. పోనీ ఇంటికెళ్లేక కోడల్ని అడిగి ఇద్దామంటే కోడలు ఎంత నోరేసుకుని పడుతుందోనని భయం.

కాస్సేపు ఆలోచించి దారి కనుక్కుంటూ ఎండలో నడకసాగించింది. కొంతదూరం వెళ్ళేక రిక్షాని బేరమాడుకుని ఎక్కింది.

కొడుకింటికెళ్ళేసరికి స్పృహ తప్పుతున్నట్టుగా వుంది సూరమ్మకి. కోడలిచ్చిన చల్లని నీళ్ళకి ప్రాణం లేచొచ్చింది.

"అబ్బాయి భోజనానికొచ్చాడా శ్యామలా"

"ఇంకా రాలేదు"

"గాలి తిరిగే వేళయ్యింది ఇంకా రాలేదా! అన్నట్టు అబ్బాయికిష్టమని జున్నుపాలు తెచ్చాను. బెల్లంతో వండు శ్యామలా. ఇప్పుడే వండెయ్యి–లేకపోతే పాడవుతాయి"

"ఇప్పుడెక్కడ తీరుద్దీ. కాస్సేపు నడుం వాల్చకపోతే నేను మనిషిని కాను"

"పోనీ నేను వండనా...." అనబోయే మింగేసింది – ఆవిడ వంటింటిరాజ్యంలోకి తనని ప్రవేశించనివ్వదని గుర్తొచ్చి. అసలావిడకి తన దగ్గర ముసలి వాసనేస్తుందంటుంది.

బహుశా ఆమె ఎప్పటికీ ముసిల్ది కాబోదు కాబోలు!

"అన్నం తిన్నారా"

"నా తిండికేం తొందర్లేమ్మా. అబ్బాయి వచ్చేక తింటాన్లే. అయినా భోజనానికి ఇంతవేళదాకా రాలేదంటే ఏమనుకోవాలి. వాడికసలు తిండిధ్యాసే వుండదు. చిన్నప్పట్నుంచీ అంతే. ఇలా అయితే ఆరోగ్యం పాడవదూ"

"అందరికీ మీకున్నట్టు వుంటుందేవిటి ఆకలీ"

కోడలు దెప్పిపొడిచిందో మరో ఉద్దేశంతో అందో బోధపళ్లేదు.

కొడుకింకా ఎందుకు రాలేదా అని తల్లడిల్లుతూనే సోఫాలో ఒదిగిపోయింది. కోడలి కేకలకి అదిరిపడిలేచింది సూరమ్మ.

"సోఫాలో పడుకున్నారేవిటి అసహ్యంగా మూలన పడుండాల్సిన ముసలాళ్ళు డ్రాయింగు రూములో తిష్ఠవేస్తే ఎలాగా"

"తప్పైపోయిందమ్మా" సంచీ తీసుకుని సామాన్ల గదిలోకెళ్లింది. ఎప్పుడొచ్చినా ఆమె పడక అక్కడే. శుభ్రం చేసుకుని ఓ బట్టపరచుకుని నిద్రపోయింది.

ఎప్పుడో చీకటిపడ్డాక మెలకువ వచ్చింది. "అబ్బాయి వచ్చాడా" అని మూడుసార్లు అడిగేక రాలేదని జవాబిచ్చింది కోడలు.

"అయ్యో-మజ్జానం భోజనం చెయ్యకుండా బిడ్డ ఎంతెలా మాడిపోతున్నాడో. వాడికి పని తప్ప వేరే యావఁ వుండదుకదా" గొణుక్కుంటూనే మగతనిద్రలోకి జారిపోయింది.

ఓ కాంట్రాక్టరు బార్‌లో పార్టీ ఇచ్చాడు సత్యనారాయణకి. ఆ కార్యక్రమం ముగించుకునొచ్చే సరికి రాత్రి పది గంటలయ్యింది.

మంచం ఎక్కబోతూంటే తల్లి వచ్చిన సంగతి చెప్పింది.

"ఇప్పుడెందుకొచ్చిందీ"

"నాకేం తెలుసూ! డబ్బు పంపట్లేదని నిలదియ్యడానికేమో!"

"ఇదొకత్తి నా ప్రాణానికి. తను చావదుగాని నన్ను చంపుకు తింటుంది"

మర్నాడు తెల్లవారేక మనవలొచ్చి లేపేసరికి అతికష్టంమీద కళ్ళు తెరిచింది సూరమ్మ.

"నీ ఒళ్ళు కాలిపోతోంది నానమ్మా"

"మీ నాన్న వచ్చాడా"

"రాత్రే వచ్చారు"

"అన్నం తిన్నాడా"

"ఇంత పొద్దున్నే ఎందుకు తింటారు నానమ్మా" నవ్వేరు పిల్లలు.

"మీ నాన్నకి తిండి యావ తక్కువ(రా. తన ఆకలి తనెరగడు"

"మా డాడీ ఇంకా చిన్నపిల్లోడనుకుంటున్నావా నానమ్మా" కిలకిలా నవ్వేరు.

"కాఫీ తాగుదువుగాని లే నానమ్మా"

"ముఖం కడగలేదు తల్లీ"

"లేచి కడుక్కోగలవా. డాడీకి చెప్పి డాక్టర్ని పిలవమంటాం"

"పొద్దుటే అబ్బాయిని కంగారు పెట్టకండి. నాకు నయమైపోద్దిలే....."

అతి కష్టం మీద లేచించి సూరమ్మ, ముఖం కడుక్కోవడానికి బాత్‌రూమ్ వైపెళ్తూ ఆగింది. అక్కడేవో పాలు ఒలకబోసినట్లుగా వుంది.

"అయ్యో! ఇక్కడ పాలెవరు ఒలకబోశా(రా!"

"నేనే పోశాను. మీరు తెచ్చిన జున్నుపాలు పాడయ్యాయి?" విసురుగా జవాబిచ్చింది కోడలు.

కొడుకోసం ఎన్నో ఇళ్ళు తిరిగి ఎంతో పదిలంగా తెచ్చిన పాలు నేలపాలయ్యాయి!

చేదు వాస్తవాన్ని తట్టుకోలేక కూలబడిపోయింది సూరమ్మ.

'నానమ్మా' అంటూ వేగంగా పరుగెత్తుకొచ్చారు మనవలు.

ఆమె జవాబివ్వలేదు.

బహుశా వెంటనే కొడుకొచ్చి పిలిచివుంటే ఇచ్చేదేమో.

కానీ అతడింకా మత్తుగా నిద్రపోతున్నాడు మరి!

**(స్వాతి మాసపత్రిక డిసెంబరు 1994)**